ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 26-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో 17 మంది చిన్నారులకు అందించారు.
- పుస్తక విజ్ఞానంతో పాటూ యువత నూతన ఆవిష్కరణల వైపు ఆసక్తి చూపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచించారు.
- సార్వత్రిక ఎన్నికల్లో ఈ సారి మహిళలు పురుషుల కంటే ఎక్కువగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది.
- ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ నగరంలో 2025 జనవరి 28 నుండి ఫిబ్రవరి 14 వరకు 38వ జాతీయ క్రీడలు జరగనున్నాయి.

==============================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు న్యూఢిల్లీలో ఏడు విభాగాల్లో అసాధారణ విజయాలు సాధించిన 17 మంది చిన్నారులకు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను ప్రధానం చేశారు. అనంతరం చేసిన ప్రసంగంలో భాగంగా వీర్ బాల్ దివాస్ సందర్భంగా సాహిబ్జాదాల ధైర్య సాహసాలకు, త్యాగానికి రాష్ట్రపతి నివాళులర్పించారు. అవార్డులు అందుకున్న చిన్నారులను రాష్ట్రపతి అభినందిస్తూ.. పిల్లల కృషి అసాధారణమని ప్రతి ఒక్కరు అసమానమైన లక్షణాలను కలిగి ఉన్నారని ప్రసంసించారు. పురస్కార గ్రహీతల విజయాలు దేశంలోని పౌరులందరికీ స్ఫూర్తిగా నిలుస్తాయని ఉద్ఘాటించారు. ఇదిలా ఉండగా నూతన ఆవిష్కరణల రంగంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను అందుకున్న సింధూర ఆకాశవాణితో మాట్లాడుతూ...

(వాయిస్ బైట్..18 సెకన్లు)

==========================

యువత పుస్తక విజ్ఞానానంతో పాటూ నూతన ఆవిష్కరణల వైపు ఆసక్తి చూపాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచించారు. ఆ దిశగా పిల్లలలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా 10 వేలకు పైగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. యువతకు చదువుతో పాటు వివిధ రంగాల్లో ఆచరణాత్మక అవకాశాలు రావాలని అన్నారు. సమాజం పట్ల బాధ్యతాయుత భావాన్ని పెంపొందించేందుకు 'మేరా యువ భారత్' కార్యక్రమాన్ని రూపొందించామని నరేంద్ర మోడీ మాట్లాడుతూ...

(వాయిస్ బైట్...38 సెకన్లు)

==========================

గ్రామీణ గృహాలకు నూరు శాతం పైపులైన్ ద్వారా నీటి సరఫరాను అందిస్తున్న ఐదవ రాష్ట్రంగా పంజాబ్ అవతరించిందని ఆ రాష్ట్ర నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖా మంత్రి హర్దీప్ సింగ్ ముండియన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం అయిన 'హర్ ఘర్ జల్' కింద నీటి కొరత సమస్యలను పరిష్కరించేందుకు 1706 గ్రామాల పరిధిలో 15 ప్రధాన కాలువ నీటి ప్రాజెక్టులను రూ.2174 కోట్ల రూపాయలతో చేపట్టామని ఈ ప్రాజెక్టుల వల్ల దాదాపు 4లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. అదే విధంగా స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద రాష్ట్రంలోని అన్ని గ్రామాలు ఓడిఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత) హోదాను సాధించాయని చెప్పారు.

==========================

సార్వత్రిక ఎన్నికలు 2024లో 64.64 కోట్ల ఓట్లు నమోదయ్యాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. 65.78 శాతంతో మహిళలు ఈసారి పురుషుల కంటే ఎక్కువగా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారని తెలిపింది. ఈరోజు ఎన్నికల సంఘం 42 గణాంకాల నివేదికలతో కూడిన సమగ్ర సమాచారాన్ని విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 14 గణాంకాల నివేదికలను కూడా విడుదల చేసింది. లోక్‌సభ 2024 నివేదిక ప్రకారం ఈ సంవత్సరం ట్రాన్స్ జెండర్ ఓట్లు 23.5 శాతం పెరిగాయి. అలాగే 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే 40 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరిగిందని పేర్కొంది.

==========================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వాయువ్య, మధ్య భారతదేశంలో రాబోయే రెండు రోజుల పాటు ఉరుములుతో కూడిన తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం(IMD) తెలిపింది. పశ్చిమ అలజడులు, తూర్పు గాలుల కారణంగా పంజాబ్, హర్యానా, చండీగఢ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, విదర్భ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో వడగళ్లతో కూడిన తుఫానులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రేపటి నుండి మూడు రోజుల పాటు హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కశ్మీర్, లడఖ్, గిల్గిత్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్‌లో తీవ్రమైన చలిగాలులు మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. రాబోయే 2-3 రోజుల్లో వాయువ్య, పశ్చిమ భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయని, ఆ తర్వాత క్రమంగా 2-3 డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని వాతావరణ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఈరోజు హల్ద్వానీ నుండి 38వ జాతీయ క్రీడల టార్చ్ రిలేను ప్రారంభించారు. ఈ జాతీయ క్రీడల జ్యోతి 33రోజుల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని 99 ప్రదేశాలను సందర్శించిన తర్వాత జనవరి 25న డెహ్రాడూన్‌కు చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దేవభూమిగా కొనియాడుతున్న ఉత్తరాఖండ్ ఇక నుంచి క్రీడా భూమిగానూ ప్రశంసలు అందుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జనవరి 28 నుండి ఫిబ్రవరి 14 వరకూ జరగనున్న 38వ జాతీయ క్రీడలు ఉత్తరాఖండ్ రాష్ట్ర అభివృద్ధికి ఒక గొప్ప అవకాశ మని పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)

==========================

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC) 2022, 2023 పరీక్షా ఫలితాలకు సంబంధించి తప్పుదారి పట్టించే ప్రకటనలు చేసినందుకు కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (CCPA) రెండు పోటీ పరీక్షల శిక్షణా సంస్థలపై 7 లక్షల రూపాయల జరిమానా విధించింది. అభ్యర్థులను తప్పుదోవ పట్టించే ప్రకటనలను వెంటనే నిలిపివేయాలని శిక్షణా సంస్థలను CCPA ఆదేశించింది. వినియోగదారుల హక్కులను పరిరక్షించడానికి ఏదైనా వస్తువులు లేదా సేవలకు సంబంధించి తప్పుడు ప్రకటనలు చేయకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధరణంగా ముగిశాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఒడుదొడుకుల్లో కదలాడి చివరకు సాధరణంగా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 78,557 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై 0.39 పాయింట్ల నష్టంతో 78,472.48 వద్ద స్థిరపడింది. ఇక ఇంట్రాడేలో 23,854.50 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 22 పాయింట్ల లాభంతో 23,750 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్లు వద్ద, బంగారం ఔన్సు 2,642 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

==========================

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఈరోజు ఆస్ట్రేలియా భారత్ పురుషుల జట్ల మధ్య నాల్గవ టెస్ట్ మ్యాచ్ మెలబోర్న్ వేదికగా ప్రారంభమయ్యింది. ముందుగా టాస్ గెలిచి బాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా తొలిరోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. భారత్ బౌలర్లలో జస్ప్రిత్ భూమ్రా అత్యధికంగా 3 వికెట్లు తీయగా ఆస్ట్రేలియా బ్యాటర్లు స్టీవ్ స్మిత్, ప్యాట్ కమిన్స్ నాటౌట్ గా నిలిచారు.

==========================

==========================